క్లుప్తంగా

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



గట్టు: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 150 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు గురుకుల, కస్తూర్బా, మానవపాడు ఇంటర్ విద్యార్థు పరీక్షలకు హాజరు కానున్నారు. డిపార్టుమెంటల్ అధికారి సత్యనారాయణ, చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డిలు వ్యవహరించనున్నారు.

యూనిఫాం మెటీరియల్ అందజేత



ధరూరు: విద్యార్థుల యూనిఫాంకు సంబంధించిన బట్టలను కుట్టు మిషన్ వారికి అందజేసినట్లు ఏపీఎం శోభారాణి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఆయా పాఠశాలల జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంల ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో వీఓఏ పద్మ, ధరూరు గ్రామ సంఘం -2 అధ్యక్షురాలు ఖాజాబీ, సీసీలు నవీన్‌కుమార్, శేఖర్, రాఘవేంద్ర, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె గ్రామంలోని గురువారం ఎస్సీ వర్గానికి చెందిన జగన్నాథ్, రంగస్వామిలపై బోయ సామాజిక వర్గానికి చెందిన గోకారి, తిమ్మప్ప, చంద్రబండ ఈరన్నలు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేస్తూ గురువారం ఎస్‌ఐ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దాడులు చేయడం చాలా దుర్మార్గం, అమానుషం అని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఫిర్యాదులు చేసిన వారి వెంట సునంద, మోజేస్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

అధికారులు స్పందించండి



అయిజ: మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఇటీవల గాలి, వానకు చెట్టు విరిగి పడింది. దారికి అడ్డంగా పడడంతో ప్రయాణికులకు ఆటంకంగా ఏర్పడింది. చెట్టు విరిగిపడి చాలా రోజులైనా అధికారులెవరూ పట్టించుకోవడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విరిగిపడిన చెట్టును తొలగించాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్ కాలనీలో ఎల్‌ఐసీ కార్యాలయం ముందు చెట్టు కొమ్మలు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలను తాగుతున్నాయి. వర్షం కురిసిన ప్రతిసారి స్పార్క్ వచ్చి నిప్పులు రాలుతున్నాయి. దానివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఆ ప్రదేశంలోని ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడమో, ఫీజులు కాలిపోవడమో జరుగుతుందని, దాని వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి చెట్టు కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది?

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- వ్యాప్తి చెందుతున్న క్రిమి, కీటకాలు
- దోమల నివారణకు చర్యలు శూన్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎర్రవల్లిలో మురుగు కుంటగా ఏర్పడిన వర్షపునీరు

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో వర్షాల కారణంగా ఇళ్ల మధ్య, పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు కుంటలుగా మారుతున్నా, వాటిపై స్థానిక పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించడం లేదు. ఆయా గ్రామాల్లో వర్షాలకు నిలిచిన నీరు, మిషన్ భగీరథ పైప్‌ల లీకేజీ మురుగు నిల్వ ఉండడం వల్ల దోమలు, ఈగలకు నివాసాలుగా మారాయి. దీనికి తోడు ఆయా కాలనీలలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. వర్షాలు ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. అయినప్పటికీ పాలకులు, అధికారులు ముందు జాగ్రత్తగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో కరువైన పరిశుభ్రత..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవల్లి, బీచుపల్లి, ఇటిక్యాల, పుటాన్‌దొడ్డి, యాక్తాపురం, సాసనూలు, దువాసిపల్లి, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం, వల్లూరు, వేముల, చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల, పెద్దదిన్నె, కొండేరు గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి 15 రోజుల పాటు గతంలో నిర్వహించినా సమస్యలు తీరలేదు. ఆయా గ్రామాలలో మురుగు రోడ్లపైనే ఇష్టానుసారంగా పారుతోంది. అక్కడక్కడ డ్రెయినేజీలు ఉన్నా వాటిని పంచాయతీ కార్మికులు శుభ్రం చేయడంలేదు. దీంతో దోమలు అధికంగా వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న తరుణంలో అధికారులు, పాలకులు స్పందించి దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.



కాలనీలో స్వైర విహారం చేస్తున్న పందులు

ఫాగింగ్, బ్లీచింగ్‌ల జాడేలేదు..

వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల్లో వర్షపు నీరు, మురుగు కుంటలుగా ఏర్పడింది. దీనికి తోడు ప్రతి ఇంటికి తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పైపుల లీకేజీ కారణంగా అంతర్గత రోడ్లన్నీ మురుగు కుంటలుగా దర్శనమిస్తున్నాయి. దీని ద్వారా కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లకపోవడంతో ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. కాలనీల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనివల్ల కాలనీల్లో ఫాగింగ్ మిషన్ వినియోగించకపోవడంతో దోమలు, ఈగలు మరింత ఉధృతం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలతో సతమతమవుతున్నాం..



ఎర్రవల్లి మండల కేంద్రంలోని షేకుపల్లి రోడ్డులో డ్రెయినేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షపునీరు, మురుగు రోడ్లపై పారుతోంది. మురుగు, మిషన్ భగీరథ నీరు కుంటలుగా ఏర్పడటంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా సమస్యను పరిష్కరించాలి.

– రవికుమార్, ఎర్రవల్లి

నివారణ చర్యలు చేపడుతున్నాం..



గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలకు బదులుగా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. అవసరమైనచోట, ఎక్కువగా జనాలు సంచరించే ప్రాంతాలలో ఫాగింగ్ మిషన్ ద్వారా ఫాగింగ్ చేపడుతాం. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారం వేయకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలో మాత్రమే వేసి సహకరించాలి.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

ఆదిశిలావాసుడి కల్యాణోత్సవం



ఆదిశిలా క్షేత్రంలో శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. మహాహోమం నిర్వహించి స్వామి వారి ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, బాబురావు చంద్రశేఖర్‌రావు, ధీరేంద్రదాసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయిజ: పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలు పఠిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. స్వామివారి కల్యాణానికి భక్తులు తరలి వచ్చారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉత్సవాల్లో పూజా కార్యక్రమాలను పురస్కరించుకుని లక్ష్మీ చెన్నకేశవ స్వామి బీరప్ప స్వాములకు పల్లకీ సేవ నిర్వహించిన అనంతరం గ్రామంలోని తుంగభద్ర నదికి వెళ్లి గంగ సేవ నిర్వహించారు. గంగ సేవలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి, విశేష పూజలు చేశారు. రాత్రి అఖండ భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విశేష పూజలు చేశారు.

శివాంజనేయ ఆలయంలో..

శాంతినగర్: మండలంలోని పైపాడు గ్రామంలో వైశాఖ పున్నమి సందర్భంగా శివాంజనేయ స్వామి ఆలయంలో పూర్ణిమ వ్రతం, ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, త్రివేణి, సత్యమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.



పైపాడులో పూజలు చేస్తున్న మహిళలు



గంగ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఉత్సవాలకు ఆహ్వానం



అలంపూర్: ఉర్సు ఉత్సవాలకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని, ఎమ్మెల్యే విజయుడిని కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఆహ్వానించారు. ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు షా–అలీ–పహిల్వాన్ ఉర్సు ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ నెల 30న గంధోత్సవం, 31న చిన్న దర్గాలో కిస్తీలు, జూన్ 1న పెద్ద దర్గాల్లో పెద్ద కిస్తీ పోటీలు జరగనున్నట్లు వివరించారు. దర్గా డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ హజ్రత్ షాహ్ అహ్మద్ ఒవైస్, బియాబాని రిఫాయి అల్ ఖాద్రి, ప్రెసిడెంట్ రుక్మద్దీన్, వైస్ ప్రెసిడెంట్ షఫీ, జనరల్ సెక్రటరీ ఖలీల్ ఉన్నారు.

గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని ఇద్దరికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని ఉండవెల్లి శివారులో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని బైక్‌తో ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి నాయుడు, వెంకటప్ప నాయుడు బైక్‌పై అలంపూర్ చౌరస్తా నుంచి జల్లాపురం గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వెంకటప్ప నాయుడు బైక్ నడుపుతూ ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మద్దిలేటి పరిస్థితి విషమంగా ఉంది. వెంటనే హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడుకు చెందిన భార్గవి(20) ఈ నెల 21న సాయంత్రం నుంచి కనబడుటలేదని తండ్రి మద్దిలేటి గురువారం ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 21న భార్గవి ఇంటి దగ్గరే ఉండడంతో కుటుంబ సభ్యులు కంచుపాడులోని ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. సాయంత్రం వాళ్లు ఇంటికి తిరిగి వచ్చి చూడగా కూతురు కనబడలేదు. బంధువులతో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం




మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యులు డా.హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న కారణంగా సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలను చైతన్యం చేస్తూ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయాలు, కాన్పుల సంఖ్య, టీబీ, లెప్రసీ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల నమోదు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి కాన్పు పీహెచ్‌సీలో చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, విధులపై అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే వివరాలను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 23న రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలు

అమరచింత: ప్రత్యూష డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్, అనిల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలను అమరచింతలో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు చిన్న, సూరి, భరత్ తెలిపారు. ప్రత్యూష డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ 15వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ చేతుల మీదుగా గురువారం విడుదల చేశారు. ప్రతిభ కనపర్చిన వారికి నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.



బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



కర్నూల్ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: కర్నూల్‌లోని ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే విజయుడు గురువారం పరామర్శించారు. ఇటిక్యాల మండలం కొండేరుకు చెందిన ప్రభుదాస్ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించినట్లు తెలిపారు. మండలంలోని శనగపల్లి గ్రామానికి చెందిన బోయలింగన్న రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా పరామర్శించారు. పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన చిన్నయ్య అనారోగ్యంతో కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకోని పరామర్శించినట్లు తెలిపారు. ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన చంటి కుమారుడు కడుపునొప్పి ఆపరేషన్ కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. రాజోళి మండలం చిన్నధన్వాడ గ్రామానికి చెందిన విజయభాస్కర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంతుండడంతో ఎమ్మెల్యే పరామర్శించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

28లోగా యూనిఫామ్స్ పూర్తి చేయాలి



ఉండవెల్లిలో పాఠశాల దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు

ఉండవెల్లి: మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్స్ కుట్టడాన్ని త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీఓ నర్సింగ్ రావ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వచ్చిన నూతన దుస్తులను కుట్టించడం టైలర్లు త్వరగా పూర్తి చేయించాలని ఏపీఎమ్ కోటీశ్వరికి డీఆర్‌డీఓ సూచించారు. అనంతరం ఉపాధి హామీ పనుల కూలి డబ్బులు చెల్లించాలని సూచించారు. మొక్కల పెంపకం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జబ్బార్, ఏపీఓ సుజాత, టీఏలు, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశానుసారం ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఆయా సబ్జెక్ట్‌ల వారీగా పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏ విద్యార్థి ఏ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయినారో, ఆ సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో ప్రతిరోజు బోధన అందిస్తున్నామన్నారు. వారం రోజులుగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు 100శాతం పదో తరగతి ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండ్ల గిరక పోటీలు



విజేతలకు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

ధరూరు: సవారమ్మ జాతరను పురస్కరించుకుని మండలంలోని మన్నాపురంలో ఎద్దుల బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. గురువారం గ్రామంలో నిర్వహించిన ఈ పోటీలు రైతులకు ఎంతో ఉత్సాంగా పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులు హాజరయ్యారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. మొదటి విజేతగా మన్నాపురం ఖాసీం రూ.20వేలు, దాత బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. ద్వితీయ బహుమతిని గంగన్‌పల్లి దరెప్ప ఎద్దులు కైవసం చేసుకోగా రూ.15 వేలు దర్శెల్లి, సంజీవ్ బరద్వాజ్‌లు అందజేశారు. మూడో బహుమతి కర్ణాటక వడ్డెవాటు రాజు ఎద్దులు గెలుచుకోగా రూ.10వేలు బూరెడ్డిపల్లి విజయ్ అందజేశారు. నాలుగో బహుమతి మన్నాపురం మాల తిమ్మన్న ఎద్దులు గెలుచుకోగా రూ.5 వేలు బోయ శంకర్, నాగేష్‌రెడ్డిలు అందజేసినట్లు నిర్వాహకులు ఆంజనేయులు తెలిపారు.

ఘనంగా గౌతమ బుద్ధుని జయంతి



గౌతమ బుద్ధునికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని 2586వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు హాజరై గౌతమ బుద్ధుని చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుని ద్వారా ఏర్పడిన బౌద్ధం ఒక కులం, మతం కాదన్నారు. సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావంతో మెలగడానికి బౌద్ధం ఒక మార్గదర్శకం అన్నారు. భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బుద్ధుని అడుగుజాడల్లో నడిచారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సికిందర్, బీసన్న, ఏసన్న, హుసేన్, జాన్ ఉన్నారు.

విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు



పాత కిష్టంపల్లి ఆంజనేయ దేవాలయ రహదారిపై విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

అమరచింత: నాలుగు రోజుల కిందట వీచిన ఈదురు గాలులకు పాత కిష్టంపల్లిలో విద్యుత్ స్తంభాలు విరిగిపడినా ఇప్పటి వరకు ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవట్లేదు. పాత కిష్టంపల్లి ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన మార్గం ఎదుట ఏర్పాటు చేసిన తోరణ స్తంభంతో పాటు వ్యవసాయ విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభం విరిగిపడింది. విషయాన్ని గమనించిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడి ఆలయం రహదారిపై పడిపోయిందని లైన్‌మెన్‌కు విన్నవించినా పట్టించుకోవట్లేదని బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు హరీష్, ప్రధానకార్యదర్శి మల్లారెడ్డి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ పూజ



కలశ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఆత్మకూర్: లక్ష్మీనర్సింహాస్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా గురువారం నవ కలశాలతో స్వామివారికి అభిషేకం, పాలకుల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూర్ శివారులోని మల్లాపురం శ్రీఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయం వద్ద ప్రముఖ వేదపండితులు శ్రీనివాసరాఘవన్, వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం హోమం, పుణ్యాహావాచనము, విశ్వక్‌సేవ, ఆరాధన, పల్లకీసేవ, ఎదుర్కోళ్లు, గరుడ ధ్వజారోహణ, యువతి, యువకుల కల్యాణపూజ, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా చెన్నకేశవస్వామి ఉత్సవాలు

పెబ్బేరు రూరల్: చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని కంచిరావుపల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం చివరి రోజు రథోత్సవంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అర్చకులు చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మంగళవాద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ చెన్నకేశవ స్వామి రథంపై కొలువుదీరగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భక్తులతో కలిసి గోవిందనామస్మరనతో రథం లాగారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి గీతాలాపన చేస్తూ.. మహిళలు కోలాటం, బొడ్డెమ్మ, పలక భజనలు వేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.